## పేరు మీరే పెట్టండి

అనేక పత్రికలు, నవలలు చదివే మీలోని ఊహాశక్తిని ఉపయోగించండి. ఈ కింది కథ చదివి దానికి ఏ పేరు పెడితే బావుంటుందో ఊహించి కింది బాక్సులో మీరే రాయండి.

స్వాతి జల్లులు నేలను తాకి సంగీతాన్ని ఆలపిస్తున్నాయి.

అక్కడక్కడా కనిపిస్తున్నాయి, పెంటిని వెంబడిస్తున్న పోతుకుక్కలు.

కరుస్తోంది అది. కసురుతోంది.

లాలనగా స్వీకరిస్తున్నాయి ఆ తిరస్కారాన్ని. తమనుకావన్నట్లుగా ఎటో చూస్తున్నాయి పోతులు. తిరిగి వెంబడిస్తున్నాయి.

ఒక నవవతి, అపురూప సుందరి, పల్లె పడుచు మూరాన చెట్లకేసి చూస్తూ

చద్దిమూట కొంగు చాటున దాచుకుంది. చినుకులకు శరీరం చిందే ఆవిర్లలో పుట్టిన కోరిక మనసును కమ్మేసింది.

ఇప్పటికిప్పుడే మగనికౌగిలిలోపూర్తిగా కరిగిపోవాలని మనసును పెనవేసుకుంటున్న కోరికల్ని ఎక్కడ దాచుకోవాలో తెలియటంలేదు.

అలాగే... తడిసిన స్పాంజిలా... పరుపు పరువున, పదినిమిషాల్లో మగని దగ్గరకు చేరింది.

జంబు గూడ చాటున నిల్చుని వున్నాడు అతను.

తనూ అంచలో దూరుతూ చద్దిమూట అతనికిచ్చింది.

ఓరగా అతనివైపుచూసింది. పైటతీసి పిండసాగింది.

ఒంగి చీరకుచ్చెళ్లను పైకి లేపి పిండసాగింది.

చూడనట్లే సద్ది తినసాగాడు అతను.

అతని కడుపుమంట చల్లార్చింది ఆవిడ

తన మనసుమంట ఎలా చల్లార్చుకోవాలో అర్థంకాలేదు. తన స్థితిలో అతడు లేడు.

గజగజ వణకుతూ కదుపుకుని నిల్చుంది.

పొట్టేలు ఒకటి గొర్రె మీదకు ఎగబడుతోంది.

ఆ దృశ్యం ఆవిడ మనసులోని కోరికను భగ్గున రగిల్చింది.

తన కోరిక తీర్చేటట్టులేడు మగడు.

గొర్రెల మందపైకి తోడేల్లు వస్తే కలిగే ఆవేశంలో వందవ వంతు కూడాలేదు. తన మీదకు దూకే ఈ కోరికల్ని అరికడదామని.

గొర్రెల మనసులో కోరికల్ని క్షణంలో పసిగడతాడు. కాని తన మనసులోని కోరికల్ని ఎంతకూ గ్రహించడు.

'అటుచూడ'మన్నట్లుగా చేయిచాపింది.

ప్రకృతి కార్యాన్ని చేయటానికి మహా తాపత్రయపడుతోంది పొట్టేలు.

వాటివేపు చూశాడు అతను.

కాంక్షగా అతన్ని చూసింది ఆవిడ, అతని కళ్లలో కోరికల తాలూకు నీడలేవైనా కన్పిస్తాయేమోనని పరీక్షిస్తోంది.

చిన్నగా నవ్వాడు.

"మందకు పొట్టేలో గొర్రో ఇంకోటి పుట్టాది. ఒకదాని కొకటి తోడైతావుంటే మంద పెద్దదైతాది. రూపాయలు కానావచ్చాయ్."అన్నాడు.

క్షణంకూడా నిలువలేక పోయిందిఆవిడ.

మంచించుక పోతున్న హృదయంతో ఇంటి దారిబట్టింది.

వర్షానికి తోడు కన్నీళ్లు కూడా ఆవిడ శరీరం మీద దాడిచేస్తున్నాయ్. చినుకుల చిటపటలకు తోడు ఎక్కిళ్ళ శబ్దాలు విన్పిస్తున్నాయి.

—ఎస్. వెంకట్రామిరెడ్డి
-(పోరుమామిళ్ళ)

స్రవంతి నెం: 12లో ఈశీర్షికలో ప్రచురించిన కథకి రచయిత శ్రీ స్యావలి శ్రీరాములు పెట్టిన పేరు: చిలాకా గోరింకలు

ఈ వారం ఈ శీర్షికలో కథల ఎన్నికల గెస్ట్ ఎడిటర్ : శ్రీ భగీరథ



"సినిమా జర్నలిస్టుగా ఏడు సంవత్సరాల అనుభవం తప్ప సాధించిందేంలేదు. నా ఆశ, ఆకాంక్ష ఏదో చెయ్యాలని. ఏం చేస్తానో భవిష్యత్తే నిర్ణయించాలి." అంటూ ప్రారంభించిన శ్రీభగీరథ, పాఠక లోకానికి బాగా సుపరిచితులు. శ్రీ శ్రీ ముందుమాట రాసిన 'మానవత' కవితాసంపుటి. 'అంతం కాదిది ఆరంభం, 'సావేరి' నవలలు కాక అచ్చుకావలసిన వెన్నోఉన్నాయి.

'ఓ కథరాయండి' కథలపై ఆయన అభిప్రాయాన్ని ఆయన మాటల్లోనే చదవండి.

"ఈ నూతన రచయితలలో రాయాలనే ఉత్సాహమే కాదు, రాయగలిగిన సత్తాకూడా ఉందని ఈ చిన్న కథలు నిరూపిస్తున్నాయి. రెంటిని ఎన్నిక చేయడం పరీక్షే! అయితే వైవిధ్యమున్న రెంటిని ఎన్నిక చేశాను. మిగతా వారు సహృదయంతో అర్థం చేసుకొని మరింత ఉత్సాహంతో రచనలుచెయ్యాలని ఆకాంక్షిస్తున్నాను."

## స్త్రీ మనసుని

గత మూడు రోజులుగా భర్త ఎందుకో మానసికంగా బాధపడుతున్నాడని గ్రహించినా గట్టిగా ఏమిటని అడగలేక పోయింది రాజ్యం.

చాకలి రావటంతో బట్టలు వెయ్యటానికి వెళ్ళింది.

భర్త విడిచి వెళ్ళిన పేంట్, షర్ట్ తీస్తుంటే పాకెట్‌లో తగిలిందో ఉత్తరం దానితోపాటు ఓ చిన్న పిల్లాడి ఫొటో. ఆ

స్రవంతి నెం: 10లో ఇచ్చిన

"మీకేం, పెళ్ళయిన ఆరునెలలకే తండ్రయ్యారు. నేను రెండేళ్ళయినా తల్లి కాలేకపోతున్నాను" అన్నది భర్తతో రాజ్యం.

వాక్యం ఆధారంగా రాసిన కథలు

ఉత్తరం చదవగానే రాజ్యానికి తమ పెళ్ళి నాటి అమ్మలక్కల మాటలు చెవుల్లో మారు మ్రోగాయి. పెళ్ళికొడుకు చదువుకొనే రోజుల్లో ఎవర్నో ప్రేమించేడట, అదికాస్త మోసం చేసేసరికి అసలు పెళ్ళే వద్దన్నాడట. తల్లి, తండ్రిపోరు పడలేక ఒప్పుకొన్నాడు చివరకి. రాజ్యంలో స్త్రీ సహజమైన ఈర్ష్య అసూయలు భగ్గుమన్నా క్రమంగా వాటి స్థానే ఆలోచనలు రూపు దిద్దుకొన్నాయి.

పెళ్ళిఅయిన క్రొత్తలో భర్త ముభావంగా ఉన్నా అతనికి యాక్సిడెంట్ అయిన తరువాత మానసికంగా ఇద్దరూ దగ్గరయ్యారు. క్రమంగా ఒకరంటే ఒకరికి ఎనలేని అనురాగం ఏర్పడింది. మళ్ళీ ఇన్నాళ్ళకి భర్త ముఖంలో విచారాన్ని చూస్తోంది. దానికి కారణం ఈ ఉత్తరమేనని తెలుస్తూనేఉంది. ఎందుకోగాని భర్త అలా ఉంటే భరించలేక పోతుంది రాజ్యం. ఏదో ఒకటి చేసి అతను సంతోషంగా ఉండేట్టుచేయాలి

అంతవరకు వచ్చిన తరువాత ఆమె రమణమూర్తిని ఎందుకుతిరస్కరించిందో. పిల్లాడిని కని అనాధగా మళ్ళీపెళ్ళిచేసుకొని స్టేట్స్‌కి వెళ్ళిందట. అందుకే అంటారు స్త్రీ మనస్సు అగాధం అని, బాబు ఫొటో చూస్తుంటే వదిలి పెట్టబుద్ధి కావటం లేదు. ఉత్తరం రాసిన అతను మంచిపనే చేశాడు.

మరురోజు భర్తకాలేజికి వెళ్ళినతరువాత అనాధ శరణాలయంకి వెళ్ళింది రాజ్యం. అక్కడ పిల్లలందరిని చూసి బాబుని గుర్తుపట్టి అడిగింది ఇష్టమున పెంచుకోవటానికి, మొన్ననే రమణమూర్తి అనే అతను ఆ బాబు కావాలని వచ్చివెళ్ళాడని మరో వారం రోజుల్లో వచ్చి తీసుకెళతాడని చెప్పారు కాని రాజ్యం డబ్బు ఆశ చూపి బాబును కొనేసింది.

సాయంత్రం ఇంటికొచ్చిన రమణ ఇంట్లో ఉన్న బాబుని చూసి దిమ్మెర పోయాడు. ఇదెలా సాధ్యం బాబు ఇంటికెలా వచ్చాడు.

"నిన్న డాక్టరు దగ్గరకి వెళ్ళాను. ఈ సారి మిమ్మల్నికూడా రమ్మన్నారు" టీ ఇసూ భర్తతో చెప్పింది రాజ్యం.

భార్య పిల్లలకోసం చేస్తున్న ప్రయత్నాలు గుర్తుకు వచ్చాయి. "అప్పుడే ఏం తొందర పిల్లలకోసం" ఎంత మామూలుగా అన్నా బాధ ధ్వనించిందా గొంతులో.

"అలాగే అంటారు మీకేం పెళ్ళయిన ఆరునెలలకే తండ్రిఅయ్యారు, నేను రెండేళ్ళు అయినా తల్లిని కాలేక పోతున్నాను" అన్నది భర్తతో రాజ్యం.

"నీ.. నీకెలా తెలుసు ఈ విషయం."

'మీకొచ్చిన ఉత్తరం'

నాలుగు రోజులుగా బాబు విషయం ఎలా చెప్పాలా అని మధనపడుతున్న తనకి సమస్యని ఇంత తేలిగ్గా పరిష్కరించిన భార్యతో తనకి జరిగిన యాక్సిడెంట్ ఫలితంగా సంతానం కలిగే యోగం లేదనే రహస్యాన్ని దాచి మభ్యపెట్టటం భావ్యం కాదనిపించింది రమణమూర్తికి. కాని బాబు విషయం ఆమె అంత తేలిగ్గా ఎలా తీసుకోగల్గింది. తనెంతో గొడవజరుగుతుంది అనుకొన్నాడు. అందుకే అంటారు స్త్రీ మనస్సు తెలుసుకోవడం కష్టమని.

—సుహాసిని

(విజయవాడ)

# దెబ్బకు దెబ్బ

ప్రఖ్యాత సినీనటుడు విమల్‌రాజన్.

ఉదయాన 8గంటల కల్లా ముస్తాబై షూటింగ్‌కు బయలుదేరాడు. ఏరోజూ ఆ సమయంలో నిద్రలేవని రాజ్యం ఆ రోజు అతని కొరకే ఎదురు చూసూఉంది. నెమ్మదిగా ఎదురువచ్చి తన చేతిలోని కాగితాలు విమల్‌రాజన్ ముందుంచి "సంతకం చెయ్యండి" అంది.

త్వరత్వరగా ఆ కాగితాలు చదివిన విమల్ రాజన్‌కు కోపం, ఆశ్చర్యం కలిగింది. "సంతకం చెయ్యలడి. మీరింత కాలం ఆ మాయలాడి హారికతో రహస్య వివాహం చేసుకుని కాపురం చేస్తూనన్ను వంచించారు. ఇకపై మీ ఆటలు సాగవు. ఈ డైవోర్స్ కాగితాల మీద సంతకం చేసే వరకూ మిమ్మల్ని కదలనివ్వను" గట్టిగా అంది రాజ్యం.

"ఏకిహాళేమైందిః" అరిచాడు విమల్ రాజన్. "మీకేం! పెళ్ళైన ఆరునెలలకే తండ్రయ్యారు. నేను రెండేళ్ళైనా తల్లి కాలేక పోతున్నాను." అన్నది రాజ్యం ఓరగా, పరిశీలనగా చూస్తూ. "దానికి నన్నేం చెయ్యమంటావ్ః ఇదినీ దౌర్భాగ్యం. అదిహారిక అదృష్టం" అన్నాడు చులకనగా విమల్ రాజన్.

"నాకు పిల్లలు కలుగకపోవటానికి నాలో ఏమాత్రం లోపం లేదని లేడీ డాక్టర్ చెప్పింది. దాంతో అనుమానం వచ్చి ఏడాది క్రితం మీరు పరీక్ష చేయించుకున్న డాక్టర్ వద్దకు వెళ్తే అతను చెప్పాడు...ఆ లోపం మీలో ఉందని, ఆ విషయం నాతో చెప్ప వద్దని మీరు అతన్ని ప్రాధేయపడ్డారనీ. కాని హారికకు పుట్టినబాబు మీ బాబు అని పత్రికలన్నీ బహిరంగంగా రాశాయి కాబట్టి, మీరిద్దరు ఇంకా విచ్చల విడిగా ప్రవర్తిస్తారనీ, నాపై జాలితో ఈ విషయం బయట పెట్టాడు డాక్టర్. మీకు నేను కావాలో అది కావాలో ఈ రోజే తేలాలి." అందిరుద్ధ కంఠంతో రాజ్యం.

"నన్ను క్షమించు రాజ్యం. నిన్నువిడనాడాలనే ఉద్దేశంనా కెపుడూలేదు" అన్నాడు మ్లానవదనంతో దోషిలా విమల్ రాజన్. రాజ్యం మనసు ఆనందంతో నిండిపోయింది. డైవోర్స్ కాగితాలను చింపి ముక్కలు చేసింది.

ఆ నాటి నుంచి మహానటి హారికఇంటికి విమల్ రాజన్ ఎపుడూ పోలేదు.

—వలపర్ల రాజారత్నంబాబు

[ఎడ్లపాడు]

## ఓ కథ రాయండి

ఈ క్రింద ఇచ్చిన వాక్యాన్ని కథలో ఎక్కడయినా ఉపయోగించి అచ్చులో అరపేజీ మించకుండా ఓ కథని రాసి వెంటనే పంపండి. ప్రచురణార్హమైన కథా రచయితలకి పాతిక రూపాయలు పారితోషికం పంపబడుతుంది.

"విడాకు లిచ్చినా మేం ఒకే ఇంట్లో ఉంటామండి" అన్నాడు సాగర్ లాయర్‌తో.